# అతను

**-పురాణం శ్రీనివాస శాస్త్రి**

''ఏనును బ్రహ్మచారి...తరలేక్షణా
నీవును కన్యవు...ఇంతకాలానకు
పెండ్లియె ఫలంబగునేని...విచారమేల?
నన్ను మునిమాన్య్య వివాహముకమ్ము లెమ్ము
కాదేని తపంబులలోన సగమిచ్చెద మాను తపోభిమానమున్''

మాస్టారు శ్రావ్యంగా పద్యం చదువుతుంటే లక్ష్మి ఏదో ఆలోచిస్తోంది.

''కవిగారి అమ్మాయివై ఉండీ..పద్యం చదువుతుంటే నీ దృష్టి ఇక్కడ లేదేమిటి?'' మాస్టారు ప్రతిపదార్థం చెప్పడానికి ఉపక్రమించే ముందు లక్ష్మి పరధ్యానం పసిగట్టి అడిగారు.

తెలుగు మాస్టారి క్లాసు....అందరూ అల్లరే.. కానీ ఆ రొదలో ప్రత్యేకించి లక్ష్మినే మాస్టారు అడగడం! అందులో లక్ష్మి ఆడపిల్ల కావడం!...

ఒక్కసారిగా క్లాసులో అల్లరి పిల్లలు సైలెన్స్ అయిపోయారు. ఆ హఠాత్ నిశ్శబ్దానికి లక్ష్మి తత్తర పడింది. లేచి నిలబడి బిత్తరపోతూ ''ఆలోచిస్తు న్నానండీ...'' అంది.

''దేని గురించి''

''అతని గురించి''

''ఎవరతను?''

''ఏమోనండీ''

''కవిగారి అమ్మాయివై ఉండీ....బాగానే ఉంద మ్మాయ్''

లక్ష్మి అదే తత్తరపాటుతో తడబడుతూ ఏదో చెప్పబోయి మాటలు పెగలక కూర్చుండి పోయింది. క్లాసు గొల్లుమంది.

పార్వతి ప్రియుడైన శివుని కోసం చేస్తోంది తపస్సు. శివుడే బ్రహ్మచారి రూపంలో ప్రత్యక్షమై ''ఒసే బంగారు బొమ్మా! పెళ్లి కోసమా ఇలా తపస్సంటూ చిక్కిశల్యమై పోతున్నావ్? పెళ్లి కోసమే అయితే బ్రహ్మచారిగాణ్ణి నన్ను పెళ్లాడెయ్. కాదు తపస్సు కోసం తపస్సంటావ్-నేనూ చేసాను తపస్సు. ఆ తపస్సు నీకు ధారపోస్తా..ఇక చాలు..తే''

శ్రీనాథుడి పద్యంలో అదేగదా అతనన్నది?

ఒక అందమైన అమ్మాయితో ఒక అందమైన బ్రహ్మచారి ఎంత చక్కగా కమ్యూనికేట్ చేసాడు. మనుషుల మధ్య ఆకర్షణ ఎంత తీయగా నేరుగా హాయిగా ఉంటాయో అలాటి సందర్భాల్లో -ఇలా ఆలోచిస్తోంది లక్ష్మి!

అందుకే తడబడుతూ 'అతని గురించి' అని నిండు క్లాసులో నిలబడి మాస్టారికి చెప్పేసింది. ఆమె సమాధానంతో ఆ రోజున క్లాసు జరగలేదు. కోతులకు కొబ్బరికాయ దొరికినట్ట యింది.

మరునాడు స్కూలు గోడల మీద 'లక్ష్మి+అతను' అని కోతి లిపిలో పెద్ద పెద్ద అక్షరాలు...

లక్ష్మి తండ్రి ఆధునిక కవి. పూర్వపు పద్యాలు రాయడు. కానీ ఆయన కవిత్వం వల్ల ఈ పిల్ల తెలుగు మాస్టారి నోట్లో 'కవిగారమ్మాయ్' అయిపోయింది...కవిగారి అమ్మాయివయ్యుండీ....అని నొక్కుకూడానూ. కుర్రాళ్ల వెంటబడి 'కవిగార మ్మాయ్' అంటూ ఆటపట్టించడం మొదలైంది పైగా.

లక్ష్మికి రాత్రిళ్లు నిద్ర పట్టడం మానేసింది. గోడ మీద రాతల సంగతి ఇంట్లో తెలియదు. లక్ష్మి+అతను! కళ్లు మూసినా తెరిచినా 'అతను'! ఎడం చేతి దొంగరాతలో వంకర టింకర అక్షరాల్లో వెక్కిరిస్తూ అతను...అతను!!

గోడమీద రాతలోంచి అ..త..ను..అనే అక్షరాలు వేరైపోయి ఓ మనిషిలా అందమైన బలమైన చురుకైన కుర్రాడిలా మారిపోయి 'కవిగారమ్మాయ్' అంటూ తనని ఆటపట్టించే పోకిరీల ముక్కుల మీద గుద్ది పచ్చడి చేస్తున్నట్లు-వాళ్ళు బాబోయ్ అంటూ దౌడు తీస్తున్నట్టు ఊహించుకుని నవ్వుకుంది. తొందర్లోనే పదో తరగతి పరీక్షలు రాబట్టి లక్ష్మి, అతను, కవిగారమ్మాయ్....ఇవన్నీ కుర్రాళ్ల జ్ఞాపకాల్లో అలుక్కుపోయి లక్ష్మి అమ్మయ్య బతికి పోయింది.

కానీ 'అ..త..ను'' అనే విడి విడి అక్షరాలు ఆమెకోసం ఏవేవో భావోద్రేకాల్లో, ఏకమై పోయి తన కూడా తోడుండేవి.

★ ★ ★

లక్ష్మి తండ్రి సూర్యశ్రీ కి చెయ్యాల్సిన ముఖ్యమైన మూడుపనులున్నాయి.

ఒకటి హిందూ మహాసముద్రం ఎప్పటికైనా శాంతి మండలం అవుతుందా అనే తక్షణ సమస్య మీద దీర్ఘకవిత రాయడం....

రెండు దాన్ని తెలుగు యూనివర్సిటీ వారి ఆర్థిక సాయంతో అచ్చోయడం...

మూడు అలా అచ్చేసిన బుక్కుకి ఎవరైనా అవార్డు ప్రకటిస్తే తీసుకుని ఒకటైనా అప్పు తీర్చేయడం...

చాలాకాలంగా ఆ ముఖ్యమైన పనులు అలా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈలోగా చెయ్యాల్సిన ముఖ్యమైన పనుల్లో కొత్తగా చేరింది లక్ష్మి పెళ్లి!

ఆయన ప్రతీదీ తాను రాయబోయే 'హిందూ మహాసముద్రం' యాంగిల్‌లోంచి ఆలోచిస్తాడు.

'అరె..నేనింకా హిందూ మహాసముద్రం రాయనే లేదు. దొడ్లో కొబ్బరిచెట్టు అప్పుడే కాపుకొచ్చేసింది.'' అని విస్తుపోతాడు.

''ఈ వీధి వీధంతా మేడ లేచేసాయ్ .సెంటర్లో గవర్నమెంట్లు బోలెడు మారాయ్. స్టేట్‌లో ఈ పదేళ్ల బట్టీ ముప్పై మూడో, నలభైరెండో సైక్లోన్లు వచ్చాయ్. ఇంకా రాయలేదు. నేను నా హిందూ మహా సముద్రం...'' అని గంటల మీద వేళ్లతో రాసుకుంటూ రోడ్డు మీద నడుస్తున్న వాడల్లా ఆగిపోతాడు.

అలాటివాడు!

ఓ ఆదివారం ఇంట్లో ''అమ్మాయ్ లక్ష్మి! పేపరిలా పట్రా'' అని అరిచి కాఫీ చప్పరించటంలో మునిగిపోయి ఉన్నప్పుడు- లక్ష్మి పెళ్లీడు నవ నవతో, తలంటోసుకున్న జుట్టుతో, టూపీస్ మిడ్డీతో పేపరుతో వచ్చినప్పుడు-

లక్ష్మి కేసి ఎగాదిగా చూసి, లాభం లేదని చప్పరించి 'హిందూ మహా సముద్రం' అనుకున్నాడు సూర్యశ్రీ.

'ప్చ్' అని నిట్టూర్చింది తండ్రి వాలకానికి.

''నువ్వేం బెంగపడకు నాన్నా....అతనున్నాడు నాకు'' కళ్లతోనే అభయం చెప్పింది.

''ఏమిటో దీని చూపుల్లో భాషకూడా మారిపోయింది. నేనింకా హిందూ....మహా..రాయనే లేదు'' అని మనసులో అనుకుని ''ఏమిటే అమ్మాయ్! అలా చూస్తావ్?'' అని పలకరించాడు.

''అతని గురించి ఆలోచిస్తున్నా నాన్నా'' అంది. లక్ష్మి చటుక్కున తడబడకుండానే.

''ఓసినీ! అతనెవరోయ్ మధ్యలో పానకంలో పుడకలాగ...''

''అతనే నాన్నా...ఎవరంటే ఏం చెప్పాలి? అతని కింకా ఓ రూపం ఏర్పడలేదు. ఎప్పుడూ నా పక్కనే ఉన్నట్టుంటాడు. బాగుంటాడు. బలంగా, అందంగా, మంచి సరదామనిషి'' ఇదంతా మనసులోనే అనుకుంటూ కళ్లతో చెప్పేస్తోంది తండ్రికి.

సూర్యశ్రీకి తన తక్షణ కర్తవ్యం బోధపడింది. ఇక లాభం లేదనుకున్నాడు. ఓ నిర్ణయానికి వచ్చేసాడు. ''మీ అమ్మనోసారి పిలు''అని పురమాయిం చాడు కూతుర్ని.

**లక్ష్మి తలస్నానం చేసి కురు లార బెట్టుకుంటూ డాబా మీద నిలబడి ఉన్నప్పుడు గాలిలా వెనక నుంచి వచ్చి చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసి అంతలోకే మాయమైపోతూ ఉంటాడు.**

తల్లిని పిలుచుకొచ్చి తలుపు చాటుకి తప్పుకుంది లక్ష్మి. వసుంధరమ్మ వచ్చి నిలబడింది భర్త ముందు ఏం చెబుతారో విందామని ఆత్రంగా...

సూర్యశ్రీ నిర్ణయం ప్రకటించాడు. ''ఒసే వసూ! కలం, కాగితాలూ టేబుల్ మీద సర్దు. ఈ రోజే మొదలు పెడతానే హిందూమహాసముద్రం'' తలుపు చాటున లక్ష్మి హతాశురాలవకుండా 'అతన్ని' తల్చుకుని మునిపంట పెదాలు నొక్కుకుని నవ్వు బిగపట్టుకుని !''అమ్మా నీకు మంచి శాస్తి జరిగిందే'! అని తల్లి ఆత్రాన్ని దెప్పిపొడిచింది.

వసుంధరమ్మ అగ్గిమీద గుగ్గిలం అయిపోయింది. వంటింట్లోంచి అట్లకాడతో రానందుకు ఇదైపోయింది. ''ఏమిటీ! కాగితాలు సర్దాలా? కవిత్వం మొదలెడతారా? సర్దుతాను సర్దుతాను. బీరువా సందులో మీ పుస్తకాలు మూలుగుతున్నాయి. ఆన పిల్లని చూడ్డానికి పెళ్లి వారొస్తున్నారు. వాళ్లకి తలోకాపీ పంచుతాను. చదువుకుని డంగైపోయి కట్నం అంటూ నోరెత్తకుండా సరే అంటారు. పెళ్లికి..లేవండి లేవండి..అలా షోలాపూర్ వాలా వరకూ వెళ్లి స్వీటూ, హాటూ పట్రండి.'' అని తరిమింది సూర్యశ్రీగార్ని.

పిల్లచూపుల సంగతి హఠాత్తుగా గుర్తుకురాగానే చేతిలో పేపరు నేలకేసి కొట్టాడు-కూతురి పెళ్లి చూపుల వార్త వేయనందుకు చిరాకుపడ్డట్టుగా! ఆ రోజు పెళ్లి చూపులయ్యాయి. అలా ఎన్నో.

లక్ష్మి కంప్యూటర్ అప్లయన్సెస్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసి ఓ ఉద్యోగంలో చేరింది. ఆమె ఆలోచనల్లోని అతను ఇప్పుడు కొంచెం ఎదిగాడు.

ఆఫీసులో కొలీగ్స్‌తో ముచ్చట్లలో మునిగిపోయి ఉన్నప్పుడు లక్ష్మిని గభాల్న ఒంటరితనంలోకి లాక్కుపోయి ఎదురుగా మూగగా కూర్చుని మాట్లాడకుండా బాధిస్తూ ఉంటాడు.

ఆమె తలస్నానం చేసి కురు లార బెట్టుకుంటూ డాబా మీద నిలబడి ఉన్నప్పుడు గాలిలా వెనక నుంచి వచ్చి చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసి అంతలోకే మాయమైపోతూ ఉంటాడు.

ఆఫీసు వ్యవహారాల్లో ఆమె కోరుకునే సలహాలే అతను ఇస్తూ ఉంటాడు.

నీరసం ఆవరించినప్పుడు లాలిస్తాడు.

విసుగ్గా ఉన్నప్పుడు చెక్కిళ్లు నిమురుతాడు.

ఈ మధ్యన ఓసారి పెద్ద పేచీ పెట్టుకున్నాడు.

''నన్ను నువ్వు మర్చిపోతున్నావు. ఉద్యోగంలో పడిపోయావు. అంతా ఇంట్లో ఇస్తూ మీనాన్నకి మగబిడ్డల్లే మారావు. కానీ మీనాన్నకి విశ్వాసం ఏముంది? తన అప్పులు తీర్చుకుని, తన హిందూ మహాసముద్రం పూర్తి చేసుకున్నాడు తప్ప నీకేమన్నా ఒరిగిందా? నువ్వు దాచుకున్న డబ్బుతో నీకు రేపో, ఎల్లుండో పెళ్లి చేస్తాడు. రైటే....అక్కడి తో నీ జీవితం ఆఖరు. ఈ కంప్యూటర్ లైన్ చాలా మంచిది. ఇందులో నువ్వు చాలా హైట్స్‌కి ఎదగ్గలవు. కానీ రెడీగా సాంప్రదాయ వాతావరణం సృష్టించుకుంటున్నావు. ఇదంతా నాకు నచ్చదు. నేను వెళ్లిపోతున్నా...పోతున్నా...'

ఓ రాత్రి అతను ఆమెలోంచి మాయమయ్యాడు.

కొద్ది రోజుల్లో ఓ సంబంధం కుదిరింది.

కొంతకాలానికి

అతన్ని లక్ష్మి పూర్తిగా మరిచిపో గలిగింది.

★★★

లక్ష్మి ప్రమోషన్లు పొంది సిస్టమ్స్ డిప్యూటీ జనరల్ మేనేజరయింది. ఎప్పుడూ ట్రావెల్స్, టూర్లు, సెమినార్‌లు, పేపర్ సబ్మిషన్లు.

లక్ష్మి భర్తది అంతా ప్లానింగ్. కొడుకు పుట్టీ పుట్టగానే ఆపరేషన్ చేయించుకున్నాడు. అతను బ్యాంకులో సీనియర్ బ్రాంచి మేనేజరయ్యాడు.

లక్ష్మి తండ్రి హిందూ మహాసముద్రం కల పూర్తి చేయకుండానే కన్నుమూసాడు. వసుంధరమ్మ అల్లుడికీ, కూతురికీ సాయంగా వాళ్లతోనే ఉంటోంది.



'నా జీవితంలో అన్నీ అమిరాయి' లక్ష్మికి అలా తృప్తిపడే తీరిక కూడా లేదు.

''లక్ష్మి బంగారు బొమ్మ'' లక్ష్మి భర్తకి అలా సంతోషించే వెసులుబాటు లేదు.

ఒకసారి భార్య, భర్తా, కొడుకు ఊటీ వెళ్లారు.

ఓ గెస్ట్ హౌస్‌లో బస చేసారు.

గదిలో బిస్మిల్లాఖాన్ షెహనాయ్ ఉక్కిరిబిక్కిరౌతోంది. షవర్ బాత్‌లో మునిగి ఉన్న లక్ష్మి అందాల మీద చీకటి వెలుగులు తారట్లాడుతున్నాయి. నిస్సహాయంగా సన్నాయి నోడ్స్ ఆమె చెవులని తాకి రీజెంట్ టైల్స్ మీదకి జారిపడుతున్నాయి. ఆమె కంఠం మీది నుంచి, నిండైన వెన్నెల ముద్దల మీదినించి, చిరుబొజ్జ మీంచి, విశ్వప్రేమికుల్ని ఓ క్షణం వెచ్చగా సేద తీర్చగల తొడల మీదినించి, గోదావరి పాయలాంటి వెన్ను వెంబడి ఎక్కడో చిన్నగా పుట్టి ఎత్తుగా విశాలంగా విడిపోయిన ఇసుక తిన్నెల లాంటి పిరుదుల మీది నించి ఒలుకుతున్న జలధారలు సన్నాయినాదంతో క్రీడించక ముందే తూములోంచి చీకటి రొచ్చులోకి మాయమవుతున్నాయి. ఆమె భర్త అరగంటలో రెడీకాబోతున్న సప్పర్ కోసం స్కాచ్‌తో రెచ్చిపోతున్నాడు. బాబు పి.సి లో కంప్యూటర్ గేమ్స్‌తో సుఖిస్తున్నాడు.

ఆ చాటున డ్రెస్సింగ్ రూమ్ అద్దంలో తనని తనే చూసుకుని జ్ఞాపకాల దొంతరల్లో ఇరుక్కుపోయింది లక్ష్మి.

''లక్ష్మీ!'' ఎవరో పిలిచినట్లయింది! తలెత్తి చూసింది. ఒక్కసారిగా కెవ్వున అరవబోయి తమాయించుకుంది.

అతను!

రూపులేని అతనికిప్పుడో రూపం వచ్చింది. బలంగా అందంగా ఉండే సరదా మనిషిలా లేడిప్పుడు. దీనంగా దేన్నో అర్థిస్తూ నిలబడ్డాడు. చిరిగిన దుస్తులు...కళ్లల్లో కొడిగట్టబోతున్న ఆశ....చేతిలో తంబూరా......కంఠంలో అభ్యర్థన.

అతను జయదేవుడై పాడుతున్నాడు!

★